నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల క్యాపిటల్ వర్క్‌ల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు వైష్ణవి ఎన్‌క్లేవ్, వనమ్స్ స్క్వేర్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, హర్ష ఆస్పత్రి వెనుక గల్లీ, డీ మార్ట్, జీజీ బాబులేన్, 11కేవీ బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంటల వరకు బ్యాంక్ కాలనీ, హెచ్‌ఏఎల్ రాఘవేంద్రకాలనీ, వేంకటేశ్వర కాలనీలలో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

దుండిగల్: విద్యుత్ ఫీడర్ లైన్ల స్ట్రింగింగ్ పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని భౌరంపేట్ సెక్షన్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కోకకోలా ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సింహపురి కాలనీ, నెస్ట్ విల్లాస్, గోకుల్ బృందావన్, కేఎల్ యూనివర్సిటీ, డీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల, డాలర్ డ్రీమ్స్, మైస్పేస్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

నేడు అమ్మవారి చీరల వేలం పాట

చింతల్: ఏపీహెచ్‌బీ కాలనీలోని కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయ ఆవరణలోని కనకదుర్గ ఆలయంలో శనివారం అమ్మవారి చీరల వేలం పాట నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ వేలం పాటలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని చీరలను దక్కించుకోవాలని ఆలయ అర్చకులు కోరారు.

పారిశ్రామిక కాలుష్యానికి వ్యతిరేకంగా రేపు నిరసన

నిజాంపేట్: పారిశ్రామిక కాలుష్యానికి వ్యతిరేకంగా ఆదివారం నిరసన తెలుపనున్నట్లు మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాచుపల్లి బొంగుల కుంట పార్క్, కేఆర్‌సీఆర్ కాలనీ, సిల్వర్ ఓక్ స్కూల్ పక్కన నుంచి బాచుపల్లి ఎక్స్ రోడ్డు వరకు ఉదయం 10 గంటలకు ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఒకవైపు హైదరాబాద్ నగరం అభివృద్ధితో విస్తరిస్తుండగా, మరోవైపు కాలుష్యం కాటేస్తోందన్నారు. నిరసనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె కోరారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు జెస్సి పాల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గాజులరామారం సర్వే నంబర్ 307, 329 /1 ప్రభుత్వ స్థలాల్లో ఇప్పటికే కబ్జాదారులు 60 గజాలు, 80 గజాల చొప్పున ప్లాట్లు చేసి విక్రయాలు చేపడుతున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాదారులకు కొంతమంది రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

కుత్బుల్లాపూర్: దాబాల్లో అక్రమ సిట్టింగ్ నిర్వహించి మద్యం విక్రయాలు చేపడుతున్న వ్యక్తులను పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విజయవర్ధన్ ఆధ్వర్యంలో కొంపల్లి, దూలపల్లి, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో విజిబుల్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. స్టీల్ సిటీ రోడ్డులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. బైసాకి దాబా, న్యూ ఫ్యామిలీ దాబాలో మద్యం విక్రయాలతో పాటు సిట్టింగ్ ఏర్పాటు చేసిన విషయంపై కేసు నమోదు చేశారు. ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలతో పాటు దాబాల్లో సెట్టింగ్‌లకు అవకాశం లేదని, అలా చేస్తే తప్పకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్ : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ విజయవర్ధన్ వివరాల ప్రకారం.. జీడిమెట్ల గంగా ఎన్‌క్లేవ్ రాయల్ నెక్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే సుబ్బారావుకు సాయి సుబ్రహ్మణ్యం (20) ఏకైక కుమారుడు. ఈ నెల 4న సాయంత్రం స్కూటీపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో స్కూటీ ఢీకొట్టింది. దీంతో సాయి సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడ్డాడు. నగరంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతని అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు ముందుకొచ్చారు.

వ్యక్తి అదృశ్యం

మూసాపేట: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శంషీగూడ, ఇంద్రాహిల్స్‌కు చెందిన మంజాల యాదగిరి (42) ఈ నెల 1వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో, బంధువుల వద్ద ఆరా తీసినా సమాచారం లభించలేదు.దీంతో పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సేవకు సలామ్..

• వివిధ వృత్తుల్లో రాణిస్తున్న మహిళలు • మరో వైపు సేవా కార్యక్రమాలు • ఆదర్శంగా నిలుస్తున్న అతివలు

వంటింటి కుందేళ్లు అన్న నోళ్లను మూయించారు. ఆడ పిల్లకు చదువు ఎందుకు అన్న వారిని ఎదురించారు. ఇంట్లో నుంచి బయటకు కాలు పెడితే పరువు పోతుందన్న రాచరిక నాగరికాన్ని చెరిపేశారు. వెరిసి ఇప్పుడు అంతరిక్షంలో మొట్ట మొదటి సారిగా పాదం మోపిన ఘనత మహిళదే. ఆటో డ్రైవర్ నుంచి మొదలు పెడితే ట్రైన్ లోకో పైలెట్ దాకా.. అక్కడి నుంచి ఎన్నో రంగాల్లో ఆకాశమే హద్దుగా పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నారు. ఆదర్శంగా నిలుస్తున్న నేటి మేటి మహిళలు సాధిస్తున్న పురోగతిని అభినందిస్తూ మహిళా లోకానికి ప్రత్యేకంగా 'ఉమెన్స్ డే' శుభాకాంక్షలు. నియోజకవర్గంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.. – జోన్‌బృందం

పాఠాలే కాదు నైతిక విలువలు బోధిస్తూ..



దుండిగల్: ప్రగతినగర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ స్రవంతి 2009 సంవత్సరం నుంచి 2016 వరకు వాగ్దేవి కళాశాలలో లెక్చరర్‌గా పని చేశారు. ఆయా విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్న సమయంలో విద్యార్థులను దగ్గరగా గమనించారు. వారిలోని అసమానతలను తొలగించి ఆత్మస్థైర్యం పెంపొందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. అనంతరం దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులను ప్రారంభించి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విద్యార్థులకు పాఠ్య శిక్షణతో పాటు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై బోధిస్తూ వారిలో విశ్వాసాన్ని కల్పించారు. స్రవంతి చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన స్టూడెంట్ ట్రైబ్ సంస్థ బెస్ట్ మోటివేషనల్ అవార్డుతో సత్కరించింది.

నలుగురికీ ఉపాధి కల్పిస్తూ..



రంగారెడ్డినగర్: రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన సుజాత ప్రైవేటు ఉద్యోగి అయిన తన భర్త నరసింహ స్వామి పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించింది. ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కాలంటే సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించాలని తలచింది. సంజయ్ గాంధీ నగర్‌లో సుధ ఎంటర్ ప్రైజెస్ పేరుతో పేపర్ ప్లేట్స్ తయారీ వ్యాపారాన్ని ప్రారంభించింది. ఒక పక్కింట్లోనే పనులను చక్కదిద్దుతూ మరో పక్క తన వ్యాపారం ద్వారా తాను ఆర్థిక లబ్ధి పొందుతూ మరో నలుగురికి ఉపాధి కల్పిస్తూ నేటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తుంది.

అనాథలను చేరదీసి..



జీడిమెట్ల: 2016లో సరస్వతి ఫౌండేషన్ సంస్థను పద్మలతారెడ్డి ప్రారంభించారు. సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు చెప్పించాలన్నదే ముఖ్య ఉద్దేశం. అలాంటి పిల్లల్ని చదివిస్తే వారి భవిష్యత్ బాగుంటుందని ఆమె అభిప్రాయం. ఇప్పటికే సరస్వతి ఫౌండేషన్‌లో 500 వరకు పిల్లలు ఆశ్రయం పొందారు. ఇది తనకు తృప్తినిస్తుంది. శక్తి ఉన్నంత వరకు అనాథ పిల్లలను చేరదీసి ఆశ్రయం కల్పించి విద్యాబుద్ధులు చెప్పిస్తానని ఆమె పేర్కొంది.

తండ్రి కల సాకారం..



కుత్బుల్లాపూర్: వెస్ట్ గోదావరి భీమవరం ప్రాంతానికి చెందిన సత్యనారాయణ, విజయలక్ష్మిల కుమార్తె డాక్టర్ శ్యామల తండ్రిని ఆదర్శంగా తీసుకుని డాక్టర్ అయ్యారు. తండ్రి సత్యనారాయణ డాక్టర్ కావాలని ఎంతో కష్టపడ్డా ఫలితం లేకుండా పోయింది. తండ్రి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగి 2011లో డాక్టర్ అయ్యారు. ఓ మహిళ డయాబెటిక్ పేషెంట్ ఇన్సులిన్ స్థితిలో ఉన్న ఆవిడకు డెలివరీ చేసే విషయంలో తన శక్తి శక్తులను ప్రదర్శించారు. చివరకు ఆమెకు నార్మల్ డెలివరీ చేయడం అనేది ఎప్పటికి మర్చిపోలేదని ఆమె సంతోషం వ్యక్తం చేసింది. ఏ వృత్తిలోనైనా లక్ష్యంతో ముందుకెళ్లాలని, కష్టపడితే తప్పకుండా ఫలితం వస్తుంది అని నేటి తరానికి సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా..



సుభాష్‌నగర్: వచ్చామా.. విధులు నిర్వహించామా.. ప్రతినెల వేతనం తీసుకున్నామా.. ప్రస్తుత రోజుల్లో ఏ శాఖలోనైనా పని చేసే ఉద్యోగుల, అధికారుల దినచర్య. కానీ విధులతో పాటు సమాజం కోసం తన వంతు సమయం కేటాయిస్తున్న వారు చాలా అరుదు. సూరారానికి చెందిన ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు వి. శారద 30 సంవత్సరాల సర్వీస్‌లో ఓ వైపు ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వహిస్తూ మరో వైపు తన ఇంటిలో రెండు గంటల పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులకు, నిరుద్యోగులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తుంది. పదో తరగతి నుంచి సివిల్ ఎగ్జామ్ రాసే వారి వరకు సులభంగా చదువులో, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేకమైన మెథడ్స్‌ను తయారు చేసింది. ఎంతోమంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందేలా కృషి చేశారు. లెక్కల భయం పోగొట్టడానికి నిమిషంలో మ్యాథ్స్ కోసం సులభమైన పద్ధతిని తయారుచేసి విద్యా అమృత్ మహోత్సవ్‌కు నేషనల్‌లో టాప్3 గా ఎంపికైంది. ఇలా మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వి.శారద ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నో అవార్డులను పొందారు. తాను రిటైర్డ్ అయిన తర్వాత కూడా ఉచితంగా విద్యను అందిస్తానని ఆమె తెలిపారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

బీఆర్‌ఎస్ శాసన సభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



నిజాంపేట్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. నిజాంపేట్‌లోని సప్తపది గార్డెన్‌లో శుక్రవారం ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవాన్ని, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించినప్పుడే దేశాభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ప్రణయ యాదవ్, గాజుల సుజాత, విజయలక్ష్మి, నాయకులు సాంబశివారెడ్డి, ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చలసాని భారతి, శ్రీలత, పద్మ, సుజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో..

జగద్గిరిగుట్ట: హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయురాళ్లను సొసైటీ అధ్యక్షులు విజయ్ కుమార్ సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ జెమిని కుమారి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ఎంఎల్ఓ రమేష్, సామాజిక వేత్త మధుబాబు, మైసా దేవి, సాజిత్, అమర్, సాయి కుమార్, సయ్యద్ ఇమ్రాన్, ఉపాధ్యాయ బృందం నాగమణి, రాజమణి, విద్యార్థులు పాల్గొన్నారు.



సృష్టికి మూలం స్త్రీ



రంగారెడ్డినగర్: సృష్టిలో స్త్రీ శక్తి ఉన్నతమైనదని చేయూత ఫౌండేషన్ చైర్మన్ వాకిటి రామ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బాలానగర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. బ్యాంక్ నిర్వాహకురాలు స్రవంతి, సిబ్బంది కల్పన, సునిత, సుధ, రమా మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు తగ్గించాలని బీజేపీ నిరసన



మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పాలనలో ఆస్తి పన్నులు సైతం ఇష్టానుసారంగా పెంచారని, వెంటనే తగ్గించాలని బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్‌సాగర్ అన్నారు. అధిక పన్నులను నిరసిస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థలు ఏదైనా ప్రజలు చెల్లించే పన్నులతో నడుస్తాయని, ప్రజలపై మోయలేని పన్నుల భారం వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జనార్దన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, ఎస్టీ మోర్చా నాయకులు శంకర్ నాయక్, లక్ష్మి, మాధురి, దుర్గా, గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ సాగర్, మురళీకృష్ణ, ప్రకాష్ రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

జగద్గిరిగుట్ట : డివిజన్‌లోని షిరిడి హిల్స్ ఏ కాలనీలో రూ. 20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ జగన్‌తో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, జగద్గిరిగుట్ట శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపిరెడ్డి, మల్లేష్ గౌడ్, జైహింద్ పాల్గొన్నారు.

ఏడాదిన్నర తరువాత అందుబాటులోకి సీసీ రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..



రంగారెడ్డినగర్: ఎట్టకేలకు సీసీ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఆ బస్తీ వాసుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ ప్రధాన రహదారిని 2024లో భూగర్భ డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేసేందుకు జలమండలి అధికారులు తవ్వి పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. అయితే నిధులు మంజూరు చేసి సీసీ రోడ్డును వేయాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు పలు కారణాలతో తాత్సర్యం చేశారు. దీంతో గిరినగర్ వాసులు రాకపోకలు సాగించేందుకు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. అదే విధంగా స్థానిక బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సైతం అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు రోడ్డు పనులను ప్రారంభించిన అధికారులు సీసీ రోడ్డును అందుబాటులోకి తెచ్చారు.

కొంపల్లిలో అవంతి పెట్‌కేర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్,ఇంద్రకుమార్

కుత్బుల్లాపూర్: అవంతీ పెట్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా క్యాట్ ఫుడ్‌ను ప్రారంభించి పెట్‌కేర్ పరిశ్రమలో అడుగు పెట్టామని అవంతి గ్రూప్ చైర్మన్, ఎండీ అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. శుక్రవారం కొంపల్లిలో అవంతి పెట్‌కేర్ లిమిటెడ్‌ను ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెంపుడు జంతువులకు సంబంధించి నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అవంతి సంస్థల ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రగ్స్ పట్టివేత

• ఇద్దరు వ్యక్తుల అరెస్ట్ • ఒకరు నైజీరియన్

కేపీహెచ్‌బీకాలనీ: డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ నైజీరియన్‌తో పాటు మరో వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..అడ్డగుట్ట సొసైటీలోని రోడ్డు పక్కన గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించిన పోలీసులు నైజీరియాకు చెందిన వ్యక్తి మరో వ్యక్తితో కలిసి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. వారి నుంచి 20 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరు డ్రగ్స్ డ్రగ్స్ ఎక్కడి నుంచి తెచ్చారు. ఎవరెవరికి సరఫరా చేశారు అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.

అల్యూమినియం పరిశ్రమలో అగ్నిప్రమాదం



కాలిపోయిన వస్తువులు

• ఒక్కసారిగా మంటలు.. పరుగులు తీసిన కార్మికులు
• 30 నిమిషాల్లో మంటలను అదుపుచేసిన ఫైర్ సిబ్బంది

జీడిమెట్ల: అల్యూమినియం పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. జీడిమెట్ల ఫైర్ అధికారి శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌లో రిషి అనే వ్యక్తి జగన్నాథ్ ఇండస్ట్రీ పేరిట అల్యూమినియం డైకాస్టింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు వెలువడ్డాయి. గమనించిన కార్మికులు వెంటనే జీడిమెట్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా.. జీడిమెట్ల ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని 30 నిమిషాల్లో మంటలను ఆర్పివేశారు. పరిశ్రమలో ఉన్న కార్మికులు మంటలు రావడంతో బయటకు పరుగులు తీసి ప్రాణాలు రక్షించుకున్నారు. కాగా సదరు పరిశ్రమలో మంటలను ఆర్పేందుకు ఎలాంటి పరికరాలు లేవని ఫైర్ సిబ్బంది తెలిపారు. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదంలో గన్నీబ్యాగ్‌లు, పాత డ్రమ్ములు బూడిదయ్యాయి. పెద్దగా ఆస్తినష్టం వాటిల్లలేదని పరిశ్రమ యజమాని తెలిపారు.

దేశాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

బాలానగర్: ప్రపంచ దేశాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని బాలానగర్ సీఐ నరసింహరాజు అన్నారు. శ్రీశ్రీనగర్ లోని సీఐటీయూ భాస్కర్‌రావు భవన్‌లో శుక్రవారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం శ్రామిక మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, అనిత, సబియా, బాషమ్మ, దీప్తి, జీనా మౌనిక, భాగ్యలక్ష్మి, సంతోష్ బాయ్, వినోద, జైతున్, సంగీత, అంబికా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ నరసింహరాజు

ఎంఎల్‌ఆర్‌ఐటీఎంలో.. ఏఐఎస్‌టీఎం అంతర్జాతీయ సదస్సు



ఏఐఎస్‌టీఎం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలలో అప్లికేషన్స్ ఆఫ్ ఏఐ ఇన్‌స్మార్ట్ టెక్నాలజీస్ అండ్ మ్యానుఫాక్చరింగ్ (ఏఐఎస్‌టీఎం) పేరిట రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సదస్సును ఎంఎల్ఆర్ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డీఆర్‌డీఓ సైంటిస్ట్ డాక్టర్ ఎన్.కిషోర్‌నాథ్, గౌరవ అతిథిగా టర్కీకి చెందిన రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎర్డెమ్‌కుచె పాల్గొన్నారు. యూఎస్ఏ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, మహారాష్ట్ర వంటి 13 ప్రాతినిధ్య ప్రాంతాల నుంచి 270 పరిశోధనా పత్రాలు అందజేయగా 130 పత్రాలను ప్రచురణకు అంగీకరించారు. ఏఐ ఆధారిత ఉత్పత్తి రంగాల అభివృద్ధి, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ, రోబోటిక్స్, గ్రీన్ టెక్నాలజీస్ వంటి పలు కీలక అంశాలపై సెమినార్లు, ప్యానెల్ డిస్కషన్లు, పరిశోధన పత్రాల సమర్పణలు జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఏఐఎస్‌టీఎం 2025 సదస్సు ద్వారా పరిశ్రమ–అకడామిక్ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, పరిశోధనలో నూతన మార్గాలను అన్వేషించడం, కృత్రిమ మేధస్సుతో ఉత్పత్తి రంగాన్ని మెరుగుపరచడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీ ప్రసాద్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సుధాకర్, కన్వీనర్ డాక్టర్ జానీ, కో కన్వీనర్ డాక్టర్ శ్రవంతి, ట్రెజరర్ డాక్టర్ రాఘవులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సూర్య ప్రకాష్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.